క్లుప్తంగా

భీమ్ సేన యువజన సంఘం కమిటీ ఎన్నిక


కమిటీని అభినందిస్తున్న సంఘం నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని కొత్తూర్‌లో ఆదివారం భీమ్‌సేన యువజన సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భీమ్‌సేన యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా లకుమల్ల ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా ఎం.ఆనంద్, పి.దినేశ్, ప్రధాన కార్యదర్శిగా ఏముల మహేశ్, కోశాధికారులుగా ఎల్.శేఖర్, ఎం.యాదగిరిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు మండల కృష్ణ, ఏముల కృష్ణ, నర్సింహ, పి.జంగయ్య, సాతరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

బడంగ్‌పేట్: వీరాంజనేయ భక్త సమాజం (గణేశ్ ఉత్సవ సమితి) సమావేశం ఆదివారం నిర్వహించారు. అనంతరం గ్రామపెద్దల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త సమాజం నూతన అధ్యక్షుడిగా సామ బాబుల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా యాదగిరి, ప్రభాకర్, లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా లాలా సందీప్, జాయింట్ సెక్రటరీలుగా బంగారు రాహుల్, సామ సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా బి.జగదీశ్వర్‌రాజు, కార్యవర్గ సభ్యులుగా మోర యాదగిరి, మరాఠి శివకుమార్, బి.భీమా, పి.మధూకర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, ఆశంగారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సామ సంజీవరెడ్డి, భీమిడి జంగారెడ్డి, గుర్రం మల్లారెడ్డి, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, బి.ప్రభాకర్, బల్వంత్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి బోనాలు


ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు

కందుకూరు: మండల కేంద్రంలో మహంకాళి బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, నృత్యాలు, శివసత్తుల పూనకాలు, డప్పు వాయిద్యాల మధ్య మహిళలు బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కాగా బోనాల ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జంగారెడ్డి తదితరులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి

ఆలయ ఫౌండర్ రెడ్డిగళ్ల రత్నం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో నేటి నుంచి ప్రారంభమయ్యే 41వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఆ ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం అన్నారు. ఆదివారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం (నేడు) స్వస్తిపుణ్యావచనము, అభిషేకం, గణపతి హోమం, మహానైవేద్యం, హారతి, తీర్థప్రసాద వితరణ, రావిర్యాలలో ఘటము ఊరేగింపు, మంగళవారం ఆలయ వద్ద అమ్మవారి కల్యాణోత్సవం, అగ్నిగుండములు, అన్నదాన కార్యక్రమం, పోతురాజుల విన్యాసాలు, బోనాలు, రావిర్యాల నుంచి ఆలయం వరకు ఘటము ఊరేగింపు, బుధవారం నివేదన, హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణతో ఉత్సవాలు ముగుస్తాయని ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సాగర్ దారి జలమయం


మన్నెగూడ కూడలిలో వరదనీరు

తుర్కయంజాల్: తేలికపాటి వర్షానికే సాగర్ రహదారి జలమయం అయింది. ఆదివారం మధ్యాహ్నం కురిసిన వానకు మన్నెగూడ కూడలిలో భారీగా వరద నీరు నిలిచింది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అధికారులు స్పందించి వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లో..


కందుకూరులో..

బహుజన వీరుడు పాపన్నగౌడ్


మీర్‌పేట: పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

మీర్‌పేట: కుల, మత, జాతి విభేదాలు లేని సమాజం కోసం కృషి చేసిన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. పాపన్న జయంతి సందర్భంగా ఆదివారం మీర్‌పేట చందన చెరువు కట్టపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బహుజనుల విప్లకారుడు పాపన్నగౌడ్ అని, 17వ శతాబ్దానికి ఆయన బహుజన రాజుగా చరిత్ర పుటల్లోకెక్కారని గుర్తుచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు అర్కల కామేశ్‌రెడ్డి, జెటావత్ శ్రీనునాయక్, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: మండల కేంద్రంలోని పాపన్నగౌడ్ విగ్రహానికి గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సరికొండ వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో సంఘం నాయకులను సన్మానించి పాపన్నగౌడ చిత్రపటాలను బహూకరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. భారతావనికి పాపన్నగౌడ్ చేసిన సేవలు మరువలేనివని, ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శులు అనేగౌని దామోదర్‌గౌడ్, ఎర్కాలీ శ్రీనివాస్‌గౌడ్, అధికార ప్రతినిధి రాకేశగౌడ్, కోశాధికారి పి.వెంకటేశ్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు మట్ట మల్లయ్యగౌడ్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధీరత్వానికి ప్రతీక

హుడాకాంప్లెక్స్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ తెలంగాణ ధీరత్వానిక ప్రతీక అని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్ డివిజన్‌లో ఆదివారం ఆయన పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్ యాదవ్, నాయకులు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, కందికంటి శ్రీధర్‌గౌడ్, రాజుగౌడ్, జంగారెడ్డి, విజయ్, కళ్యాణ్ యాదవ్, నవీకుమార్, సాయి పాల్గొన్నారు.

కనుల పండువగా మార్కండేయ రథయాత్ర


రథయాత్రలో పాల్గొన్న సంఘం సభ్యులు

మహేశ్వరం: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీలో పద్మశాలీ పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ భక్త మార్కండేయస్వామి రథయాత్ర కనుల పండువగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని సంఘం ఆధ్వర్యంలో గత ఆరేళ్ల నుంచి ఈ రథయాత్ర నిర్వహిస్తున్నామని సంఘం సభ్యులు తెలిపారు. పద్మశాలీ సంఘ భవనం నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయం వరకు కొనసాగింది. సోమవారం ఉదయం యజ్ఞోపవిత కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

పుస్తె మెట్టెలు అందజేత

కేశంపేట: పేదింటి ఆడ బిడ్డల పెళ్లిళ్లకు మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి పుస్తె మెట్టెలను ఆదివారం అందజేశారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన అబ్బి లక్ష్మయ్య పద్మ, గౌతాపురం రాంచంద్రయ్య రాణి దంపతుల కుమార్తెల వివాహాల నిమిత్తం మాజీ సర్పంచ్ పుస్తె మెట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాండ్ర విజయలక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామానికి చెందిన డొల్ల రాములు శనివారం మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం మాజీ జెడ్పీటీసీ విశాల శ్రావణ్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లేశ్‌యాదవ్, రమేశ్, ఆనంద్‌రెడ్డి, మనోహర్, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు


పోతురాజుల నృత్యాలు. చిత్రంలో చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: మండల పరిధి తులేకలాన్ గ్రామంలో మహంకాళి బోనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉప్పరిగూడ, ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి రాందాస్‌పల్లిలో భక్తులు గ్రామదేవతలకు బోనం ఎత్తారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు డప్పుచప్పుళ్లతో మధ్య బోనాలను ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి తీసుకెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, కౌన్సిలర్లు కుంట్ల మౌనిక, మర్రి అర్చన, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సంత.. వ్యర్థాలతో చింత


అంగడిబజారు కాలనీ మధ్యలో సంతలో పాడైపోయిన కూరగాయలు

- పాడైన కూరగాయలను సంతలోనే వదిలేస్తున్న వ్యాపారులు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న అంగడిబజార్ కాలనీ వాసులు
- పట్టించుకోని తైబజార్ నిర్వాహకులు

చేవెళ్ల: వారంతపు సంతలో పేరుకుపోతున్న వ్యర్థాల సమస్య పరిసర ప్రాంత ప్రజలను వేధిస్తోంది. ఈ వారం అంగడి అనంతరం మళ్లీ వారం వరకు వ్యర్థాలతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని మండల కేంద్రంలోని అంగడిబజార్ కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఆదివారం కాలనీ ప్రజలు సంత ఆవరణలో ఉన్న వ్యర్థాలను అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలను విలేకరులకు చూపించి, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. అంగడి బజార్ కాలనీ మధ్యలో ఏన్నో ఏళ్ల నుంచి కూరగాయల సంత(అంగడి) కొనసాగుతోంది. ఇక్కడ అన్ని రకాల కూరగాయలతో పాటు నిత్యావసర వస్తువులు అన్ని ప్రజలకు అందుబాటులో దొరుకుతాయి. ప్రతి గురువారం ఈ సంత జరుగుతుంది. అయితే వ్యాపారులు కూరగాయలు విక్రయించగా.. మిగిలిన వ్యర్థాలను అక్కడే వదిలేయటం లేదా పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పోసి వెళ్తున్నారు. మళ్లీ వారం రోజుల వరకు వీటిని తొలగించేవారు లేక అవీ అక్కడే ఉండి కుళ్లిపోతున్నాయి. దీంతో ఆ వ్యర్థాలపై పశువులు, పందులు తిరుగుతున్నాయి. ఓ వైపు వర్షాలు పడుతుండటంతో ఈ సంత జరిగే ప్రాంతం మొత్తం అపరిశుభ్రంగా మారుతోందని కాలనీ ప్రజలు వాపోతున్నారు. వ్యర్థాల నుంచి దుర్వాసన, ఈగలు, దోమల స్వైర్య విహారం చేస్తున్నాయని వాపోతున్నారు. వీటితో రోగాల బారిన పడుతున్నామని అంటున్నారు. పంచాయతీలో, తైబజారు వేలం పాటలో దక్కించుకున్నవారు సంత నిర్వహణ పరిశుభ్రతపై దృష్టి సారించటం లేదని వాపోతున్నారు. దీనిపై అధికారులు, పాలకులు దృష్టి సారించి ఈ వారంతపు సంతతో ఎదురతువుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు. గతంలో పంచాయతీ పాలకవర్గానికి చెబితే వారు వచ్చి శుభ్రం చేసి వెళ్లారు. కానీ ఇది ప్రతి వారం ఇలాగే జరుగుతుందని, నిర్వహణ బాధ్యతలను ఎవరికైనా అప్పగిపంచేలా చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. లేదంటే ప్రతీ వారం ఈ సమస్య కాలనీ ప్రజలను వేధిస్తోందని వాపోతున్నారు. లేదంటే సంత నిర్వహించే సమయంలో వ్యాపారుల కోసం ప్రత్యేకంగా చెత్త డంపింగ్ స్థలాలను ఏర్పాటు చేసి వ్యర్థాలను అందులో వేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వ్యర్థాలతో అపరిశుభ్రంగా మారిన సంత పరిసరాలు

అర్హులందరికీ రుణమాఫీ

- రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దు
- మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం: నియోజకవర్గంలోని రుణమాఫీ కానీ ప్రతి రైతుకు రుణమాఫీ చేయిస్తానని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ సూచనలు పాటించి రుణమాఫీ కాని రైతుల కోసం కొత్తగా కొన్ని నియమాలను సూచించిందని, వాటిల్లో ఏవైనా తప్పులు ఉంటే సరిదిద్దుకునే అవకాశం కల్పించిందని తెలిపారు. పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోపు 2 లక్షల రుణ మాఫీ చేసి, రైతులను రుణ విముక్తిని చేశారని తెలిపారు. పలు సాంకేతిక సమస్యల కారణంగా అర్హత ఉండి ఎవరికైనా రుణమాఫీ కాకపోతే ఆందోళన చెందొద్దని సూచించారు. అర్హత ఉండి రుణమాఫీ లిస్టులో లేని రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయ కార్యాలయం లేదా తుక్కుగూడలోని తన కార్యాలయాన్ని పత్రాలతో సంప్రదించాలని ఆయన సూచించారు.

బాధిత కుటుంబానికి చేయూత

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని ఎలికట్ట గ్రామానికి చెందిన నక్క మణెమ్మ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న అంబా భవానీ పొదుపు సంఘం అధ్యక్షుడు సంజీవయాదవ్ ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. పొదుపు సంఘంలో నక్క మణెమ్మ సభ్యురాలు కావడంతో సంఘం తరపున ఆర్థికసాయం అందజేసినట్లు సంజీవయాదవ్ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రంగమ్మ, ఆశవర్కర్ లలిత, బద్దుల లక్ష్మయ్య, నక్క శ్రీశైలం, ఆర్ల లింగం, శ్రీలత తదితరులు పాల్గొన్నారు


బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న సంఘం సభ్యులు

ఆజాద్ సంఘం అధ్యక్షుడిగా మహ్మద్ ఖరీమ్


నూతన సభ్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న మైనార్టీ నాయకులు

మొయినాబాద్‌రూరల్: మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ యూత్ అసోసియేషన్ హిమాయత్‌నగర్ అధ్యక్షుడిగా మహ్మద్ ఖరీమ్‌ను ఆ గ్రామ మైనార్టీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మైనార్టీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా మహ్మద్ ఖరీమ్‌ను, ఉపాధ్యక్షుడిగా షేక్ రెహమత్‌లను ఎన్నుకొని వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం మైనార్టీ నాయకులు వారికి నియామకపత్రాలను అందజేసి పూలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవియాదవ్, జావిద్, ఆసీఫ్, రజాక్, వజీర్, మహ్మద్ జబ్బార్, మిరాజ్, మహేశ్, కుమార్, మల్లేశ్‌యాదవ్, గిరి, మైనార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులకు రక్షణ కరువు



సాగర్‌రోడ్డుపై గునుగల్ అటవీ ప్రాంతం

- చుట్టూ కంచెలేక రోడ్లపైకి వస్తున్న జింకలు
- రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్న జంతువులు
- కంచె నిర్మాణ ప్రతిపాదనల ఫలితం శూన్యం


నందివనపర్తిలో వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన జింక (ఫైల్)

యాచారం: గునుగల్ అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు రక్షణ కరువైంది. చుట్టూ కంచెలేక జంతువులు జనారణ్యంలో సంచరిస్తూ ప్రమాదాల బారిన పడుతుండగా.. గొడ్డలి వేటుకు క్రమంగా వృక్ష సంపద తరిగిపోతోంది. మహానగరానికి చేరువలో ఉన్న అరణ్యంలో జింకలు, నెమళ్లు, అడవి పందులతో పాటు పలు రకాల జంతువులు ఉన్నాయి. ఇక్కడి నుంచి 80 కిలో మీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలం మున్ననూర్ అడవి నుంచి జంతువులు రాకపోకలు సాగిస్తుంటాయి. చిరుతలు కూడా ఉండేవి. కానీ ప్రస్తుతం వాటి జాడ కానరావడం లేదు. 1674 హెక్టార్లలో.. చుట్టూ 58 కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్న అడవి.. జంతువులతో పాటు వృక్ష సంపదకు పెట్టింది పేరు. హైదరాబాద్‌కు 40 కిలో మీటర్ల దూరంలో సాగర్ రహదారికి ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతం ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకుంటుండగా.. చుట్టూ రక్షణగా ఎలాంటి కంచె లేకపోవడంతో వన్యప్రాణులు రహదారుల పైకి వచ్చి మృత్యువాత పడుతున్నాయి. పంటపొలాలను ధ్వంసం చేస్తున్నాయి.

58 కిలోమీటర్ల మేర..

వన్యప్రాణులు, వృక్ష సంపద రక్షణకు అడవి చుట్టూ కంచె నిర్మాణానికి ఇబ్రహీంపట్నం డివిజన్ అటవీ శాఖ అధికారి విష్ణువర్ధన్‌రావు గతంలో పూర్తిగా సర్వే చేయించారు. 58 కిలో మీటర్ల మేర పొడవునా కందకాల తవ్వకం, కంచె నిర్మాణం, అడవిలో బోరుబావులు తవ్వించి సోలార్ మోటార్ల ఏర్పాటు తదితర వాటి కోసం రూ.24 కోట్ల నిధుల మంజూరుకు అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపారు. కానీ ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. ఫలితంగా జంతువులు వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుంటుండగా.. విలువైన శ్రీగంధం, గంధ చెట్లు మాయం అవుతున్నాయి.

వీధి కుక్కల దాడి

ఈ అడవిలో సుమారు వెయ్యికి పైగా జింకలు ఉన్నాయి. చుట్టూ ఎలాంటి కంచె లేకపోవడంతో రోడ్లపైకి వస్తున్నాయి. ఈ క్రమంలో వాహనాలు ఢీకొట్టడమో.. వీధి కుక్కల బారిన పడి మృత్యువాత పడటం నిత్యం జరుగుతోంది. ఇటీవల నందివనపర్తి గ్రామంలో వ్యవసాయ పొలం వద్దకు వచ్చిన ఓ జింకపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. పక్షం రోజుల క్రితం చౌదర్‌పల్లి–గునుగల్ గేట్ల మధ్యన జింకలు గుంపులుగా సాగర్‌రోడ్డు పైకి రావడంతో ఓ వాహనదారుడు తనకారును సడన్ బ్రేక్ వేసి ఆపగా.. వెనకాల వస్తున్న రెండు వాహనాలు ఢీకొన్నాయి.

చర్యలు తీసుకోవాలి



పక్షం రోజుల క్రితం హైదరాబాద్ నుంచి మా స్వగ్రామం తక్కళ్లపల్లి తండాకు కుటుంబ సభ్యులతో కారులో వెళ్తున్నాను. గునుగల్ అడవిలోంచి జింకలు గుంపులుగా ఒక్కసారే రోడ్డు పైకి వచ్చాయి. వాటిని తప్పించడానికి సడన్‌గా బ్రేక్ వేయాల్సి వచ్చింది. అంతకు ముందే కొద్ది దూరంలో ఓ జంతువును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. వన్యప్రాణుల రక్షణకు చర్యలు తీసుకోవాలి.

– అంగోత్ తుకారాం, పర్వతారోహకుడు

ప్రతిపాదనలు పంపాం



అటవీ ప్రాంతం చుట్టూ కంచె, కందకాల నిర్మాణం కోసం నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. జింకల, ఇతర వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి అడవిలో మూడు సోలార్ బోర్లు ఏర్పాటు చేశాం. మరో రెండు బిగింపునకు కృషి చేస్తున్నాం. జంతువులను ఎవరైనా చంపితే కఠిన చర్యలు తీసుకుంటాం. పంట నష్ట పరిహారం చెల్లింపు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– నర్సింహనాయక్, గునుగల్ అటవీ సెక్షన్ అధికారి